క్లుప్తంగా

జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

పెదపాడు: పెదపాడు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి బుధవారం వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు తగు ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాట్లుపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ రాక

దెందులూరు: జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి గురువారం ఉదయం 9 గంటలకు బాలసదన్ నుంచి బయలుదేరి గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలకు విచ్చేస్తారని హెచ్ఎం వడ్లపట్ల విజయకుమార్ తెలిపారు. ఉన్నత పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొంటున్నారని ఆయన వివరించారు.

సొసైటీ చైర్మన్‌గా కడియాల

ఉంగుటూరు: కాగుపాడు మాజీ సర్పంచి కడియాల రవిశంకర్‌కు నారాయణపురం సొసైటీ చైర్మెన్ పదవి దక్కింది. సొసైటీ డైరెక్టర్లుగా బొట్టాదుర్గారావు,(నీలాద్రిపురం), గొతు బాలబాస్కరరావు(రామచంద్రపురం)లు నియామకం చేశారు. గురువారం కడియాల ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



పేదలకు ఆహార పొట్లాలను అందజేస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. గణపవరం, సరిపల్లె, బువ్వనపల్లి గ్రామాల్లో నిరుపేదలు, వీధి బాలలకు, సంచార జాతుల వారికి, అనాథలకు, వృద్ధులకు ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్, కార్యదర్శి కిలారి రవి, ఉపాధ్యక్షుడు కాకర్ల వినాయక, జిల్లా చైర్మన్ కేఎస్ఎన్ మూర్తి, పచ్చిపులుసు నాగేశ్వరరావు, బైరబోయిన మాల్యాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్ షాపుల తనిఖీ



పాన్ షాపులో తనిఖీ చేస్తున్న సీఐ రజనీకుమార్

గణపవరం: పొగాకు ఉత్పత్తులు, మాదక ద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యం పాడవుతుందని ఇలాంటి ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రజనీకుమార్ అన్నారు. విద్యాలయాల సమీపంలో ఉన్న పలు పాన్ షాపులను బుధవారం పోలీసులు తనిఖీలు చేశారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సై ఆకుల మణికుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగుకు ఏర్పాట్లు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాలు మొదలవుతాయని కాలేజీ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసు తెలిపారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయాధికారులు



వేప కషాయం తయారు చేస్తున్న రైతులు

పెదవేగి: రసాయన ఎరువుల వినియోగంతో కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్న నేపథ్యంలో రైతుల్లో సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి పెరుగుతోంది. ఒకప్పుడు సేంద్రియ ఎరువులను వినియోగించి సాగు చేసేవారు. అయితే అధిక దిగుబడుల సాధన కోసం రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. దీర్ఘకాలం రసాయన ఎరువులు వినియోగిస్తే భూసారం క్షీణించడంతో పాటు భూమి చౌడుబారిపోతుందని నిపుణులు చెబుతుండడంతో రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. భూసారం పెంపుదలకు సేంద్రియ ఎరువులైన పశువుల పేడ, కోడి పెంట, చీకిన గడ్డితో పాటు చెరువులు, కుంటల్లోని పూడిక మట్టిని పొలాలకు తరలిస్తున్నారు. దీర్ఘకాలం రసాయన ఎరువుల వాడకంతో పంట ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయని ఆహార పరిశోధన సంస్థలు తెలియజేస్తున్నాయి. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలిచ్చే సేంద్రియ ఎరువులనే వాడాలని రైతులు నిర్ణయించుకుంటున్నారు. నియోజకవర్గ పరిధిలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో అనేక మంది రైతులు సేంద్రియ సాగుకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ భూముల్లో పంట దమ్ములు జోరుగా ప్రారంభమయ్యాయి. పంట దమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను పొలాల్లో వేసి కలియ దున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి మంచి ఫలితాలు వస్తాయని రైతులు చెబుతున్నారు.



సేంద్రియ వ్యవసాయంలో సాగు చేస్తున్న తైవాన్ జామను పరిశీలిస్తున్న అధికారులు



ఎర్రలతో గుల్ల చేసిన మట్టి

సేంద్రియ ఎరువులతో ప్రయోజనాలెన్నో

సేంద్రియ ఎరువుల వాడకంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని పెదవేగి మండల వ్యవసాయాధికారి డి.రాధిక చెబుతున్నారు. పశువుల పెంట, పూడికమట్టిని వేయడంతో భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయన్నారు. వీటిని వినియోగిస్తే భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోకుండా ఉండేందుకు దోహదపడతాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడిన పంట పొలాల్లో చీడపీడలు, తెగుళ్లు తక్కువగా ఉంటాయని తెలిపారు. పూడిక మట్టి పశువుల పేడల్లో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ పోషక విలువలు లభించడంతో పైర్లు సహజసిద్ధంగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు.

ఖర్చు తగ్గుతుంది

సేంద్రియ ఎరువుల వినియోగంతో సేద్యంతో ఖర్చులు తగ్గుతున్నాయి. పంట దమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను పొలంలో వేసి కలియదున్నడంతో భూసారం పెరుగుతుంది. దీంతో పంట సమయంలో యూరియా వంటి ఎరువుల అవసరం అంతగా ఉండటం లేదు.

–ఎస్.లక్ష్మణరావు, రైతు, కొప్పాక

డిమాండ్ పెరిగింది

పశువుల పెంపకం తక్కువగా ఉండటంతో సేంద్రియ ఎరువులు వేస్తున్నాం. దీని వలన దిగుబడితో పాటు పంటలో నాణ్యత పెరిగింది. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు తయారవుతున్నాయి. ఇవి దీర్ఘ కాలం నిలువ ఉంటున్నాయి. ఖర్చు తగ్గి లాభాలు పెరిగాయి.

–కె.చలపతయ్య, రైతు, భోగాపురం

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 10వ తేదీ ఉదయం 9.30 గంటలకు బువ్వనపల్లిలోని నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహిస్తామని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు తెలిపారు. బాబు షూ్యరిటీ–మోసం గ్యారంటీ అనే నినాదంతో పార్టీ పిలుపు మేరకు నిర్వహించే కార్యక్రమం అమలుపై ఈ సమావేశంలో చర్చించి, దిశానిర్దేశం చేస్తామన్నారు. నాలుగు మండలాల నుంచి పార్టీ ప్రముఖులు, మండల కమిటీల సభ్యులు, గ్రామ కమిటీల సభ్యులు, ఇతర అనుబంధ సంఘాల సభ్యులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్టీ జిల్లా, రాష్ట్ర కమిటీల సభ్యులు సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

దమ్ము చక్రాలతో రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు

పెదపాడు: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను రహదారులపై నడపడం నిషేధమని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెదపాడు తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా దమ్ము చక్రాల ట్రాక్టర్లను రోడ్డుపై నడపొద్దని, ఒకవేళ నడిపినట్లెతై చక్రాలకు పట్టాలు వేసి నడపాలని సూచించారు. ఈ దమ్ము చక్రాల కారణంగా రహదారులు ఛిద్రమయ్యే అవకాశమున్నందున ట్రాక్టర్ యజమానులు గమనించాలని తెలిపారు.

రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలి

భీమడోలు: సార్వా సీజన్‌లో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి అన్నారు. పోలసానిపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలిసి సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్, ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి క్షేత్ర సందర్శన చేశారు. సాగులో రైతుల అనుమానాలను వారు నివృత్తి చేశారు. విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సభకు ముఖ్య అతిథులుగా హాజరైన ఏడీఏ పి.ఉషారాజకుమారి, సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్ మాట్లాడుతూ రైతులు సాగులో వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలన్నారు. రైతులు విధిగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఎకరాకు రూ.850 చెల్లించి బీమా పొందాలని కోరారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి అర్హుల జాబితాను వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. అన్నదాత సుఖీభవ పోర్టల్, మన మిత్ర వాట్సాప్‌లో ఆధార్ నంబర్ ద్వారా రైతుల అర్హతను తెలుసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన రైతులు జాబితాలో లేకుంటే రైతులు ఆర్జీతో పాటు సంబంధిత పత్రాలను అందించాలన్నారు. ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి అమర్‌నాథ్, వీఏఏ, వీహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.



వరి చేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

దండువారి పుంతకు మహర్దశ



దండువారి పుంతలో డస్టు వర్క్ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం ప్రధాన వంతెన పడిపోవడంతో ప్రజలు మరికొన్ని ప్రత్యామ్నాయ రహదారులను ఉపయోగిస్తున్నారు. ఇది ప్రజా ప్రతినిధులకు బాగా కలిసి వచ్చింది. ఈ ప్రత్యామ్నాయ రహదారుల్లో నియోజకవర్గ ప్రజా ప్రతినిధికి ఆ సామాజిక వర్గానికి చెందిన రియల్ ఎస్టేట్ భూములు ఉండటం వలన వారికి మరింత లబ్ధి చేకూరింది. నారాయణపురం నుంచి చేబ్రోలు–తల్లాపురం వెళ్లే రహదారిలో కలిసే వరకు దండువారి పుంత అంటారు. అయితే సహజంగా ఈ పుంతకు ఏఎంసీ నిధులు కూడా కేటాయించలేదు. కేవలం రైతులకు చెందిన పుంత. అయితే గణపవరం, భీమవరం, ఉండి ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు, చేపలు లోళ్లు ఈ రహదారిని ఎంచుకొని చేబ్రోలు పోలీస్‌స్టేషన్ వద్ద వంతెన మీదుగా జాతీయ రహదారికి వెళుతున్నాయి. దీంతో ఈ రహదారి ప్రాధాన్యత క్రమంలో చేరి, తారురోడ్డుగా మార్పు చేశారు. ఇందుకోసం రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించారు. అలాగే నారాయణపురం రాజుల కాలనీ వద్ద నుంచి ఉంగుటూరు గ్రామంలోకి ఉన్న పుంత రహదారికి రూ.80 లక్షల నిధులు కేటాయించారు. ఇటీవల ఈ రహదారికి కంకర లారీలతో కంకర తోలించారు. రబ్బస్ పనులు పూర్తి చేశారు. త్వరలో తారురోడ్డుగా రూపాంతరం చెందనుంది. పుణ్యం పురుషార్థం కలిసి వచ్చినట్లుగా నియోజకవర్గ ప్రజా ప్రతినిధికి ఇదొక మహర్దశ అని చెప్పాలి. ఈ విషయంపై రాజకీయ వర్గాలవారు, ప్రజలు చర్చించుకుంటున్నారు. అంతేగాక ప్రస్తుతం వాహనదారులకు ఈ రహదారులే ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి.

కేబుల్ కనెక్షన్ తొలగింపు



డిష్ యాంటీనాను ఏర్పాటు చేసుకున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి

దెందులూరు: కేబుల్ ఆపరేటర్లు సాక్షి ఛానల్ ప్రసారాలను నిలుపుదల చేసినందుకు నిరసనగా దెందులూరులో కేబుల్ కనెక్షన్లను తొలగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి తొత్తడి వేదకుమారి కేబుల్ కనెక్షన్ తొలగించి డిష్ యాంటీనా ఏర్పాటు చేసుకున్నారు. గౌడ వీధులు కేబుల్ కనెక్షన్లను తొలగించమని ఇప్పటికే ఆపరేటర్లకు చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం మాట్లాడుతూ ట్రాయ్ నిబంధనల ప్రకారం కేబుల్ ఆపరేటర్లు తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరించడం కుదరదన్నారు. సాక్షి ఛానల్ ప్రసారాలను నిలుపుదల చేయడం దుర్మార్గమని ఇప్పటికే అనేక గ్రామాల్లో కేబుల్ కనెక్షన్లను తొలగించేందుకు సిద్ధపడి డిష్ యాంటీనాలను పెట్టించుకునేందుకు ప్రైవేట్ ఏజెన్సీలను సంప్రదిస్తున్నారన్నారు. త్వరలోనే కేబుల్ ఆపరేటర్లకు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఒకవైపు వినియోగదారుల దగ్గర నుంచి డబ్బులు తీసుకుంటూనే సాక్షి ఛానల్ ప్రసారాలను నిలుపుదల చేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

నిందితుడికి జైలు, జరిమానా

భీమడోలు: ఓ కేసులో నేరం రుజువైనందున ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ భీమడోలు సివిల్ జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి బుధవారం తీర్పు ఇచ్చారు. పల్నాడు జిల్లా రాజంపాలెం మండలానికి చెందిన తమ్మిశెట్టి గోపి అనే ముద్దాయికి జైలుశిక్ష, జరిమానాను విధించారు. అంబర్‌పేట రైల్వే గేటు పక్క ఉన్న ఆరు ఎకరాల రొయ్యల చెరువులో గుమస్తాగా పనిచేస్తున్న కె.మణికంఠ మార్చి 17వ తేదీన రాత్రి 9 గంటలకు చెరువు షెడ్డుకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. 18వ తేదీ ఉదయం చెరువు వద్దకు వచ్చేసరికి ఎలక్ట్రికల్ త్రీఫేస్ కెపాసిటర్ కనిపించలేదు. దీనితో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు తమ్మిశెట్టి గోపి దొంగించి పరారైనందున పోలీసులు ఆతడిని పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. కేసును ఏపీపీ టి.శశికళ వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

కదం తొక్కిన కార్మికవర్గం



భీమడోలు: భారీ ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు



దెందులూరు: మానవహారం నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

భారీ ర్యాలీ, మానవహారం చేసిన కార్మికులు

భీమడోలు: మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ బుధవారం దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. పలు శాఖల కార్మిక వర్గం భీమడోలు పురవీధుల్లో కదం తొక్కారు. తొలుత సీఐటీయూ మండల కార్యాలయం వద్ద సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి నినాదాలు చేసుకుంటూ భారీ ర్యాలీ, ప్రదర్శన చేశారు. జాతీయ రహదారిపై భీమడోలు జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు నినాదాలు చేశారు. 8 గంటల పని హక్కును రక్షించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఆర్.లింగరాజు మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును రద్దు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, దుర్గారావు, అనిల్, వీరయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగుల మానవహారం, నిరసన

దెందులూరు: అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు జాతీయ సమ్మెలో భాగంగా బుధవారం దెందులూరులో నిరసన వ్యక్తం చేసి, మానవహారంగా ఏర్పడి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులను బానిసలుగా మారుస్తోందన్నారు. లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

సమస్యల ఏకరువు

నిడమర్రు: చానమిల్లి, బావాయిపాలెం, క్రొవ్విడి, సిద్దాపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పల్లె పల్లెకు మన పత్సమట్ల కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో పలు ప్రజా సమస్యలపై స్థానికులు ఏకరువు పెట్టారు. అన్ని గ్రామాల్లో శివారు గ్రామాల్లో త్రాగునీరు. ఇంటి స్థలాలు, ఇంటి పట్టాలు, విద్యుత్, పింఛన్లు వంటి పలు సమస్యలు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృష్టికి తీసుకెళ్లారు.

పోర్టిఫైడ్ రైస్ గంజి వార్చకూడదు



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు అందిస్తున్న విటమిన్లు గల పోర్టిఫైడ్ రైస్ గంజి వార్చకూడదని, ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ చిత్తా విజయ ప్రతాపరెడ్డి అన్నారు. గుండుగొలను, పాతూరు, పూళ్ల గ్రామాల్లోని రేషన్‌షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం విద్యాశాఖ, రెవెన్యూ, ఐసీడీఎస్ తదితర శాఖల జిల్లా అధికారులతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. గుండుగొలనులోని రేషన్ దుకాణం, ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, పాతూరులోని మండల స్టాక్ పాయింట్‌లు, పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. వంటశాలలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో 714 మందిలో కేవలం 480 మంది భోజనం చేస్తున్నారని, సంఖ్య పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖాధికారిణి ఆర్‌వీ నాగరాణి, సివిల్ సప్‌లై డీఎం శివరామమూర్తి, డీఎస్‌వో విలియమ్స్, ఏడీ వెంకటప్పయ్య, ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్ గౌస్, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంఈవో–2 అయినపర్తి భాస్కరకుమార్, హెచ్ఎంలు సునీత, భువనేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన పనితీరుకు పీఏఐ



భీమడోలు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి



దెందులూరు: శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు

భీమడోలు: గ్రామ పంచాయితీల పనితీరును మరింత మెరుగుపరచడమే పంచాయతీ అడ్వాన్స్ ఇండెన్స్(పీఏఐ) 2.0 లక్ష్యమని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమంపై గ్రామ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎస్ఎంలకు ఒక రోజు శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కోర్స్ డైరెక్టర్‌గా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి వ్యవహరించారు. మాస్టర్ ట్రైనర్ టి.ముత్తయ్య, టీవోటీలు వి.ధర్మారావు, పవన్‌కుమార్ శిక్షణ అందించారు. గ్రామ పంచాయతీల్లో పాలన వికేంద్రీకరణ, పారదర్శక, ప్రభావవంతమైన పరిపాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ వెంకట్రావు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

దెందులూరు: పాలనాపరంగా విధి నిర్వహణలో పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ 2.0పై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో కె.శ్రీదేవి అన్నారు. బుధవారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ఉద్యోగులు. సచివాలయ ఉద్యోగులకు ఒకరోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధన, శాఖా పరమైన పలు వ్యవస్థల నిర్వహణకు పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ పూర్తి స్థాయిలో దోహదపడుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో భీమరాజు, అన్ని శాఖల మండల అధికారులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలు

భీమడోలు: సెక్షన్ పరిధిలోని సూరప్పగూడెం సబ్‌స్టేషన్‌లోని చెట్లు కొమ్మల తొలగింపు నిమిత్తం ఈ నెల 11వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శివాజీ తెలిపారు. సూరప్పగూడెం, పోలసానిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

సవరణ

జూన్ 30న ఉంగుటూరు 9వ పేజీలో ప్రచురితమైన ప్రకటనలో అడ్వకేట్ పేరును V.V.P.DHARMA RAYUDU గా చదువుకోగలరు.

ప్రకటన

I.P.No.05/2025

[illegible]

కె.ఆర్.కె.చౌదరి,
అడ్వకేట్ – ఏలూరు
ఏలూరు
ది.08.07.2025

